సాక్షి కాకినాడ

గురువారం । 1 । మే । 2025




సృష్టి కర్తా శ్రమ జీవే..
సంపదకు మూలం శ్రమ. ఆ శ్రమను చేసే శ్రామికులు దశా, దిశా నిర్ణేతలు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో విస్తారంగా మానసిక, శారీరక శ్రామికులున్నారు.



చేతికందొచ్చి.. మృత్యు తీరానికి చేరి..
రెండు కుటుంబాల్లో చేతికి అందివచ్చిన కొడుకులను మృత్యువు కబళించడంతో ఆ తల్లిదండ్రుల వేదనకు అంతులేకుండా పోయింది.

8లో

1,933 క్యూసెక్కులు విడుదల



ధవళేశ్వరం: కాటన్ బ్యారేజీ నుంచి బుధవారం 1,933 క్యూసెక్కుల మిగులు జలాలను సముద్రంలోకి విడుదల చేశారు. బ్యారేజీ వద్ద నీటి మట్టం 8.65 అడుగులకు చేరింది. డెల్టా కాలువలకు నీటిని విడుదల చేయలేదు.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా పాలిసెట్

బాలాజీచెరువు (కాకినాడ): పదో తరగతి ఉత్తీర్ణులైన అభ్యర్థులకు పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు నిర్వహించే పాలిసెట్–2025 బుధవారం జిల్లాలో ప్రశాంతంగా జరిగింది. కాకినాడ అర్బన్‌తోపాటు రూరల్ ప్రాంతాల్లో 21 కేంద్రాలు, పిఠాపురంలో 7 కేంద్రాలు ఏర్పాటు చేశారు. పరీక్షకు 9,558 మంది దరఖాస్తు చేయగా 8,846 మంది హాజరయ్యారు. కాకినాడ డివిజన్‌లో బాలురు 4,220 మందికి గాను 3,955 మంది హాజరుకాగా, బాలికలు 2,995 మందికి 2,737 మంది హాజరయ్యారు. పిఠాపురం డివిజన్‌లో బాలురు 1,361 మందికి 1,257 మంది హాజరుకాగా, బాలికలు 982 మందికి 898 మంది హాజరయ్యారు. పరీక్షలు అన్ని కేంద్రాల్లో ప్రశాంతంగా నిర్వహించినట్టు జిల్లా కో–ఆర్డినేటర్ ఎస్.జనార్ధనరావు తెలిపారు.

ఏపీ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉంది

పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు సోము వీర్రాజు



విలేకరులతో మాట్లాడుతున్న వీర్రాజు

బోట్‌క్లబ్ (కాకినాడ సిటీ): ఏపీ అభివృద్ధికి బీజేపీ కట్టుబడి ఉందని ఆ పార్టీ జాతీయ కార్యవర్గ సభ్యుడు, ఎమ్మెల్సీ సోము వీర్రాజు అన్నారు. కాకినాడలో బుధవారం ఆయన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. విడిపోయిన ఏపీకి రాజధాని నిర్మాణం చేసేందుకు గతంలో కేంద్ర ప్రభుత్వం రూ.18 వేల కోట్లు నిధులు ఇచ్చిందని, ప్రస్తుతం రూ.15 వేలు కోట్లు ఆర్థిక గ్రాండ్ కూడా మంజూరు చేసిందన్నారు. వివిధ కేంద్ర సంస్థలను కేటాయించిందన్నారు. ఎన్నో పరిశ్రమలు ఏర్పాటుకు సహాయ సహకారాలు అందిస్తోందన్నారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ శుక్రవారం రాష్ట్రానికి వస్తున్నారన్నారు. వెనుకబడి ప్రాంతం రాయలసీమ ప్రాంతంలో రూ.3 వేల కోట్లతో ఇండస్ట్రీయల్ కారిడార్ ఏర్పాటు చేశామన్నారు. రాష్ట్రంలో 11 నదుల ద్వారా రూ.50 వేల కోట్లతో ఇంటింటికీ మంచినీటి కుళాయి ఇచ్చేందుకు చర్యలు తీసుకొంటున్నట్లు చెప్పారు. బీజేపీ జిల్లా అధ్యక్షుడు బిక్కిన విశ్వేశ్వరరావు, రాష్ట్ర ఉపాధ్యక్షుడు వేటుకూరి సూర్యనారాయణరాజు పాల్గొన్నారు.

సివిల్స్ ర్యాంకర్‌కు అభినందన



కలెక్టర్ షణ్మోహన్‌ను కలసిన సివిల్ సర్వీస్ 94వ ర్యాంకర్ స్నేహిత్

కాకినాడ సిటీ: యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (సివిల్ సర్వీసెస్) పరీక్షల్లో ఆల్ ఇండియా 94వ ర్యాంకు సాధించిన పిఠాపురం పట్టణానికి చెందిన చక్కా స్నేహిత్ బుధవారం కాకినాడ కలెక్టరేట్‌లో కలెక్టర్ షణ్మోహన్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయన సివిల్ సర్వీస్ విజేత స్నేహిత్‌కు అభినందనలు తెలిపారు.

రాములోరి భూముల్లో రావణాసురులు

- 'పవన్'కు చెప్పినా పనికాలేదు
- రూ.20 కోట్ల స్థిర ఆస్తులు చెరపట్టిన వైనం
- కూటమి పంచన ఆక్రమణదారులు
- గోర్సలో పాతికేళ్లుగా పోరాటం

సాక్షి ప్రతినిధి, కాకినాడ: రాములోరి భూముల్లో రావణాసురులు చొరబడ్డారు. పిఠాపురం రాజా హయాంలో భద్రాచల రాముడిని పోలిన పంచలోహ విగ్రహంతో పిఠాపురం నియోజకవర్గం గోర్స గ్రామంలో రామాలయాన్ని నిర్మించారు. ఆలయ నిర్వహణ కోసం నాడు 30 ఎకరాలు దానం చేశారు. ధూపదీప నైవేద్యాల కోసం నాడు సర్వే నంబర్ 121, 122లో గోర్సలో 19.92, కుతుకుడుమిల్లిలో సర్వే నంబర్ 142/1లో 4.89 ఎకరాలు, 142/2లో 6.25 ఎకరాలు ఉన్నాయి. గోర్సలోని 19.92 ఎకరాలను కండేపల్లి నాగన్న, అప్పన్న కౌలుకు తీసుకుని సాగు చేసేవారు. దేవదాయశాఖ అధీనంలో ఉన్న ఈ భూములకు రెండేళ్లకు ఒకసారి వేలం నిర్వహించేవారు. కాలక్రమంలో దేవదాయశాఖ అధికారులతో కొందరు ఆక్రమణదారులు కుమ్మక్కై రికార్డులు తారుమారు చేసి భూములు రిజిస్ట్రేషన్ చేయించుకున్నారు. 2008కి ముందు తొమ్మిది మంది ఆక్రమణలో ఉన్న గోర్స భూములు కాలక్రమంలో 20 మంది, ప్రస్తుతం 34 మంది చేతుల్లోకి పోయాయి. రెవెన్యూ అధికారులు ముడుపులు మెక్కి ఈ భూములపై పాస్‌పుస్తకాలు ఇవ్వడమే కాకుండా ఆన్‌లైన్‌లో కూడా నమోదు చేయించారు. ఆక్రమణదారులు దేవస్థానం భూములను అల్లుళ్లకు కట్న కానుకలుగా కూడా ధారాదత్తం చేసేయడంతో చేతులు మారాయి. ఆక్రమణలో ఉన్న గోర్స భూముల కోసం పాతికేళ్ల క్రితం గ్రామస్తుడు నామాలస్వామి న్యాయ పోరాటంలో మొదలు పెట్టారు. అయితే వయసు మీదపడటంతో అలసిపోయారు. అయినా రాములోరి భూముల కోసం పోరాటాన్ని గ్రామస్తులు విడిచిపెట్ట లేదు. స్థానికులకు 2013లో హిందూ ధర్మరక్షణ సమితి సభ్యులు కూడా తోడయ్యారు.



పిఠాపురం మహారాజా నిర్మించిన గోర్స రామాలయం

ముడుపులు ముట్టజెపుతూ..

ఇప్పుడు ఆ భూమి ఎకరం రూ.కోటి పైనే పలుకుతోంది. రెండు పంటలు.. అవసరాన్ని బట్టి మూడో పంట కూడా సాగు చేస్తుంటారు. మిగిలిన గ్రామాల్లో భూములకు ఇబ్బంది లేకున్నా ఒక్క గోర్స గ్రామంలో మాత్రమే కూటమి నేతల కబ్జాలో ఉన్నాయి. గోర్సలో సారవంతమైన రాములోరి భూములు ఆక్రమించుకున్న కబ్జాదారులు వాటిని కాపాడుకునేందుకు వేర్వేరు పార్టీల్లో ఉన్న వారు కూటమిగా జత కట్టిన తెలుగుదేశం, జనసేన పార్టీల పంచన చేరారు. ఇరుపార్టీలకు చెందిన నాయకులు, అనుచరుల ఆక్రమణలోనే ఈ భూములుండగా అధికారులకు అడిగినంతా ముడుపులు ముట్టజెపుతూ పబ్బం గడుపుతున్నారు. రూ.కోట్లు విలువ చేసే ఆ భూముల కోసం పాతికేళ్లుగా గ్రామస్తులు అలుపెరగని పోరాటం చేస్తున్నారు. ఈ భూముల కోసం 2008లో అప్పటి దేవదాయ ధర్మాదాయ శాఖ ఉన్నతాధికారులకు గ్రామస్తులు చేసిన ఫిర్యాదులపై విచారణ నిర్వహించి ఆ భూమి దేవస్థానానికి చెందినదిగా నిర్ధారించారు. అడంగల్ ప్రకారం వెంటనే భూమిని దేవదాయ శాఖ స్వాధీనం చేసుకోవాలని ఆదేశాలు జారీచేశారు. ఆ భూమికి అక్రమంగా సృష్టించిన పాస్ పుస్తకాలతో పాటు ఆక్రమణదారులు అనధికారంగా సంపాదించిన హక్కుల రద్దుకు ఆదేశాలు జారీచేశారు. భూమిని అనుభవిస్తున్న వారు హైకోర్టులో వేసిన కేసు వీగిపోవడంతో తిరిగి ట్రిబ్యునల్‌కు వెళ్లారు. ఈ క్రమంలో 2023లో వైఎస్సార్ సీపీ తీసుకువచ్చిన జీవో ప్రకారం దేవస్థానం భూములు తిరిగి దేవస్థానాలకే అప్పగించాలని జిల్లా ఉన్నతాధికారులకు ఆదేశాలు వచ్చాయి. ఇందుకు తగ్గట్టు జిల్లా ఉన్నతాధికారులు భూములను స్వాధీనం చేసుకోవడానికి ఏర్పాట్లు చేసే క్రమంలో సార్వత్రిక ఎన్నికలు రావడంతో ఈ ప్రక్రియకు బ్రేక్ పడింది.

ఉప ముఖ్యమంత్రి పవన్‌కు విన్నవించినా దక్కని ఫలితం

ఇంతలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో రాములోరి భూములు కబ్జాచేసిన వారు ఆ పార్టీ పంచన చేరారు. జనసేన, తెలుగుదేశం పార్టీల అండతో దేవదాయ శాఖాధికారులను గుప్పెట్లో పెట్టుకుని ఆక్రమణలో ఉన్న భూములు కాపాడుకుంటున్నారు. భూములకు ఆక్రమణ చెర వీడేలా ఆదేశాలు ఇవ్వాలని పిఠాపురం నియోజకవర్గానికి ప్రాతినిధ్యం వహిస్తోన్న ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి గ్రామస్తులు తీసుకువెళ్లారు. పవన్ ఆదేశాలతో ఈ నెల 4న భూములు అప్పగిస్తున్నామంటూ అధికారుల సమాచారంతో స్థానికులు రామాలయం వద్దకు వచ్చినా కుంటిసాకులతో మళ్లీ వాయిదా వేశారు. స్థానికులు ఈ నెల 25న కొత్తపల్లి వచ్చిన పవన్‌కల్యాణ్‌కు అడ్డంపడి మరోసారి వినతి పత్రం అందజేశారు. అయినా అతీగతీ లేదని స్థానికులు ఆక్షేపిస్తున్నారు. న్యాయస్థానాల్లో అనుకూలంగా తీర్పులు వచ్చినా, ఉప ముఖ్యమంత్రికి మొర పెట్టుకున్నా ఫలితం దక్కక పోవడానికి ఆక్రమణదారులైన కూటమి నేతలు తెర వెనుక చక్రం తిప్పడమే కారణమంటున్నారు. సనాతన ధర్మం కోసం కాషాయకండువాలతో దీక్షలు చేసిన పవన్ కల్యాణ్ ఉప ముఖ్యమంత్రిగా ఆదేశాలు ఇచ్చినా భూములకు మోక్షం కలగలేదంటే ఆయన చిత్తశుద్ధి ఏపాటిదో అర్థమవుతోందని గ్రామస్తులు మండిపడుతున్నారు. చారిత్రక నేపథ్యం కలిగిన గోర్స రామాలయం భూములు చెర వీడుతాయనే నమ్మకం కలగడం లేదంటున్నారు. కూటమి నేతలు ఒత్తిళ్లతోనే రెవెన్యూ, దేవదాయశాఖ అధికారులు నిమ్మకు నీరెత్తినట్టు వ్యవహరిస్తున్నారని గోర్స గ్రామస్తులు మండిపడుతున్నారు. ఇప్పటికైనా రాములోరి భూములకు చెర విడిపించాలని స్థానికులు కోరుతున్నారు.



ఆక్రమణలో ఉన్న గోర్స రామాలయ భూములు



భూములను పరిశీలిస్తున్న దేవదాయ శాఖ అధికారులు

అధికారుల చర్యలు శూన్యం



న్యాయస్థానాలు తీర్పులు ఇచ్చినా రాముని భూములు కబ్జాదారుల చెర వీడటం లేదు. ఎన్నో ఏళ్లుగా గ్రామస్తులు పోరాటాలు చేస్తున్నారు. దేవదాయశాఖ అధికారులకు అన్నీ తెలిసినా ఆచరణలోకి వచ్చేసరికి భూములు తిరిగి స్వాధీనం చేసుకోకపోవడం అన్యాయం. దాదాపు పాతికేళ్లుగా ఆందోళన చేస్తున్నాం. ఈ విషయం మా ఎమ్మెల్యే, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ దృష్టికి తీసుకువెళ్లాం. జిల్లా అధికారులకు ఆదేశాలు జారీచేశారు. అయినా ఇంతవరకు భూములు దేవదాయశాఖకు దఖలు పడేలా అధికారుల నుంచి చర్యలు కనిపించ లేదు.

– అయినంపూడి సత్యనారాయణరాజు, భూముల ఉద్యమ కార్యాచరణ నేత, గోర్స, ఉప్పాడ కొత్తపల్లి

కబ్జాదారులకు వత్తాసు



భూములు దేవదాయశాఖకు దఖలు పరిచే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తాం. ఎన్నో ఏళ్లుగా న్యాయస్థానాల చుట్టూ తిరిగాం. న్యాయం జరిగిందనుకుంటున్న తరుణంలో యంత్రాంగం చొరవ తీసుకోవడం లేదు. ఎంతో చారిత్రక నేపథ్యం ఉన్న గోర్స రాములవారి ఆలయ భూములు ఆక్రమణకు గురైనా అధికారులు పట్టించుకోకపోవడం తీరని వేదనకు గురిచేస్తోంది. భూములను కబ్జాచేసి అనుభవిస్తున్న వారికి కొందరు వత్తాసు పలుకుతూ గ్రామానికి అన్యాయం చేస్తున్నారు. ఇది చూస్తూ ఎవరూ ఉపేక్షించరు.

– రొంగల వీరబాబు, గ్రామ సర్పంచ్, గోర్స, ఉప్పాడ కొత్తపల్లి

కోరం లేక 'కోట' మున్సిపల్ సమావేశం వాయిదా



సభ్యులు హాజరుకాకపోవడంతో ఖాళీగా దర్శనమిస్తున్న కౌన్సిల్ హాల్

సామర్లకోట: కోరం లేకపోవడంతో సామర్లకోట మున్సిపల్ కౌన్సిల్ సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు చైర్‌పర్సన్ గంగిరెడ్డి అరుణ ప్రకటించారు. బుధవారం ఆమె అధ్యక్షతన కౌన్సిల్ సమావేశం జరగాల్సి ఉండగా కౌన్సిల్ సభ్యులు పూర్తి స్థాయిలో హాజరుకాలేదు. టీడీపీకి చెందిన ముగ్గురు కౌన్సిలర్లతో పాటు వైఎస్సార్ సీపీకి చెందిన కాళ్ల శ్యామల, చల్లపల్లి వెంకట సత్యనారాయణ మాత్రమే హాజరయ్యారు. దీంతో కోరం సరిపోలేదు. కౌన్సిల్‌లో 31 మంది సభ్యులుండగా 29 మంది వైఎస్సార్ సీపీ నుంచి గెలుపొందారు. వైఎస్సార్ సీపీకి చెందిన ఒక కౌన్సిలర్ మృతి చెందగా ఎన్నికల ముందు ఇద్దరు కౌన్సిలర్లు టీడీపీలో చేరారు. దీంతో టీడీపీ బలం నాలుగుకు చేరుకుంది. ప్రస్తుత సమావేశం నిర్వహణకు 16 మంది సభ్యులుండాలి, ఐదుగురే హాజరుకావడంతో సమావేశాన్ని వాయిదా వేస్తున్నట్లు చైర్మన్ అరుణ ప్రకటించారు. ఏప్రిల్ రెండవ తేదీన చైర్మన్‌పై బల నిరూపణకు అవకాశం ఇవ్వాలని 22 మంది కౌన్సిలర్లు మున్సిపల్ కమిషనర్ శ్రీవిద్య, కలెక్టర్‌లకు వినతిపత్రం అందజేశారు. మూడవ తేదీన పార్టీ వ్యతిరేక కార్యక్రమాలు చేపడతున్నారని వచ్చిన ఫిర్యాదుల మేరకు వైఎస్సార్ సీపీ అరుణను సస్పెండ్ చేసింది. ఈ నేపథ్యంలో అరుణ సమావేశం నిర్వహణకు సిద్ధంకాగా వైఎస్సార్ సీపీ కౌన్సిలర్లు హాజరు కాలేదు. ప్రభుత్వం నుంచి పట్టణాభివృద్ధికి రూ.మూడు కోట్లు మంజూరయ్యాయని, కౌన్సిల్‌లో చర్చించి ఆమోదించాల్సి ఉండగా సభ్యుల హాజరుకాలేదని చైర్ పర్సన్ అరుణ అన్నారు.

వినియోగంలోకి సత్యదేవుని కొత్త నివేదన శాల

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: స్థానిక శ్రీవీర వేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో తుని పట్టణానికి చెందిన దాత చెక్కా సూర్యనారాయణ (తాతబాబు) నిర్మించిన నివేదనశాలలో ఎట్టకేలకు బుధవారం నుంచి నివేదనల తయారీ ప్రారంభించారు. 'సాక్షి'దినపత్రికలో ఏప్రిల్ 25వ తేదీన 'నిరుపయోగంగా నివేదనశాల' శీర్షికన ప్రచురితమైన కథనంతో అధికారులు స్పందించారు. ఈ నివేదనశాలలో భక్తులకు పంపిణీ చేసే పులిహోర, దద్దోజనం, ఇతర ప్రసాదాలు తయారు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు. సత్యదేవునికి నివేదనలు, పులిహోర, దద్దోజనం, చక్రపొంగలి, విడిపొంగలి వంటి ప్రసాదాలు తయారు చేసేందుకు స్వామివారి ఆలయానికి దిగువన కుడివైపు ఒక నివేదనశాల ఉంది. 2023లో భక్తులు వేచి ఉండేందుకు కంపార్ట్‌మెంట్ తరహాలో క్యూ కాంప్లెక్స్ నిర్మాణంలో భాగంగా ఆ నివేదనశాలను హాలులా అప్పటి ఈఓ చంద్రశేఖర్ అజాద్ మార్చారు. దీంతో నివేదనలు తయారు చేసేందుకు రామాలయానికి ఎదురుగా గల సర్క్యులర్ మండపం మీద తుని పట్టణానికి చెందిన దాత చెక్కా సూర్యనారాయణ (తాతబాబు) రూ.30 లక్షల వ్యయంతో కొత్త నివేదన శాల నిర్మించి 2023 ఆగస్టు నెలలో దాత చేతుల మీదుగా ప్రారంభించారు. 2023 నవంబర్‌లో ఈఓ చంద్రశేఖర్ అజాద్ బదిలీ కాగా ఆయన స్థానంలో ప్రస్తుతం దేవదాయశాఖ ఇన్‌చార్జి కమిషనర్‌గా వ్యవహరిస్తున్న కె.రామచంద్రమోహన్ ఈఓగా బాధ్యతలు స్వీకరించారు. పాత నివేదనశాలలోనే మళ్లీ నివేదనలు తయారు చేయాలని ఆయన ఆదేశించారు. దీంతో పాత నివేదనశాలకు మార్పులు చేసి 2023 నవంబర్ నుంచి ఉపయోగిస్తున్నారు. దీనిపై 'సాక్షి'లో ఏప్రిల్ 25న 'నిరుపయోగంగా నివేదనశాల' శీర్షికన కథనం ప్రచురితం కాగా దేవస్థానం చైర్మన్ ఐవీ రోహిత్, ఈఓ వీర్ల సుబ్బారావు స్పందించారు. కొత్త నివేదనశాలలో భక్తులకు పంపిణీ చేసే పులిహోర, దద్దోజనం, చక్రపొంగలి తయారు చేయాలని ఆదేశించారు. దీంతో బుధవారం లాంఛనంగా అందులో నివేదనల తయారీ ప్రారంభించారు.



'సాక్షి'దినపత్రికలో ఏప్రిల్ 25న ప్రచురితమైన కథనం



నివేదనశాలకు కొబ్బరికాయ కొడుతున్న హెడ్ కుక్ కొండబాబు, ఇతర సహాయకులు

కంచి పీఠం ఉత్తరాధికారిగా గణేశ శర్మకు బాధ్యతలు



పీఠం ఉత్తరాధికారి 'శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి'కి అభిషేకం చేస్తున్న కంచి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ



కంచి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామితో పీఠం ఉత్తరాధికారి 'శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి

- శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామిగా నామకరణం
- పులకించిన అన్నవరం

అన్నవరం: కాకినాడ జిల్లా అన్నవరానికి ప్రసిద్ధ కంచి కామకోటి పీఠానికి గల అనుబంధం మరింత బలపడేలా స్థానిక యువ పండితుడు, చతుర్వేది, ఏకసంథాగ్రాహి, దుడ్డు సత్యవేంకట సూర్య సుబ్రహ్మణ్య గణేశ శర్మ ద్రావిడ్ తమిళనాడులోని కాంచీపురంలో గల కంచి కామకోటి ఉత్తరాధికారిగా, తదుపరి 71వ పీఠాధిపతిగా అక్షయ తృతీయ పర్వదినాన బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సత్యదేవుని నామం కలిపి 'శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామిగా ఇకపై భక్తుల ఆశయాలకు ప్రతీకగా నిలుస్తారని కంచి కామకోటి పీఠాధిపతి జగద్గురు శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ అభిభాషించారు.

శాస్త్రోక్తంగా సన్యాస దీక్ష

కంచిలోని శ్రీ కామాక్షి అమ్మవారి ఆలయంలోని పంచగంగా తీర్థంలో ఉదయం 5–30 నుంచి ఎనిమిది గంటల వరకు జరిగిన వైదిక కార్యక్రమంలో పండితుల మంత్రోచ్చాటన మధ్య దుడ్డు గణేష్ శర్మ ద్రావిడ్ యజ్ఞోపవీతాన్ని విసర్జించారు. తల్లిదండ్రులు దుడ్డు ధన్వంతరి, మంగాదేవి సమక్షంలో వేలాది మంది భక్తులు, పీఠం అభిమానులు చూస్తుండగా సన్యాసి దీక్ష స్వీకరిస్తున్నట్లు బిగ్గరగా మూడుసార్లు ఆకాశం వైపు చేతులు ఎత్తి ప్రకటించారు.

శంకరునికి శూలంలా... విష్ణువుకు చక్రంలా యతికి దండం

శరీరంపై ఉన్న తెల్లని వస్త్రాలను కూడా నీటిలోనే వదిలి కంచి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామీజీ ఇచ్చిన కాషాయ వస్త్రాలను ధరించారు. అనంతరం శంకరునికి శూలంలా, విష్ణువుకు చక్రంలా యతి కి దండం ఎల్లప్పుడు దుష్ట శిక్షణ, శిష్ట రక్షణ చేస్తుందని స్వామీజీ ఉపదేశించి దండాన్ని అందించారు. దండాన్ని చేతబూని 'శ్రీ సత్య చంద్రశేఖరేంద్ర సరస్వతి స్వామి'గా భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం పెద్ద స్వామీజీతో కలిసి కంచి కామాక్షి అమ్మవారి దర్శనం చేసుకున్నారు. తరువాత కంచి పీఠంలో శ్రీ చంద్రశేఖరేంద్ర మహాస్వామి, శ్రీ జయేంద్ర సరస్వతి స్వాముల బృందావనాలను దర్శించారు. తరువాత కంచి కామకోటి పీఠాధిపతి శ్రీ శంకర విజయేంద్ర సరస్వతి స్వామితో కలిసి పీఠంలో శ్రీచంద్రమౌళీశ్వర స్వామి పూజలో పాల్గొన్నారు. అనంతరం భక్తులకు దర్శనమిచ్చారు.

అన్నవరంలో ప్రత్యేక పూజలు

శ్రీదుడ్డు గణేష్ శర్మ ద్రావిడ్ సన్యాస దీక్ష స్వీకరించిన సందర్భంగా స్థానిక శ్రీసత్యదేవ బ్రాహ్మణ నిత్యాన్నదాన సత్రంలో జగద్గురు ఆదిశంకరాచార్యులుకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. సత్రం అధ్యక్షుడు నాగాభట్ల కామేశ్వరశర్మ, ఇతర సభ్యులు పాల్గొన్నారు.

పాఠ్య పుస్తకాలొస్తున్నాయ్..

- ఉమ్మడి జిల్లాకు 16,48,640 సెమిస్టర్–1 పుస్తకాలు అవసరం
- ఇప్పటికే 5,46,935 పుస్తకాల రాక

రాయవరం: ఏటా విద్యా సంవత్సరం ప్రారంభం రోజునే విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు అందజేసే విధానానికి గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం శ్రీకారం చుట్టింది. ఇదే విధానాన్ని విద్యాశాఖ కొనసాగిస్తోంది. పాఠశాల ప్రారంభం రోజునే పాఠ్య పుస్తకాలు, సర్వేపల్లి రాధాకృష్ణ విద్యార్థి మిత్ర కిట్ అందించే దిశగా అడుగులు వేస్తోంది. ప్రస్తుత విద్యా సంవత్సరానికి అవసరమైన పాఠ్య పుస్తకాల సరఫరాను ఇప్పటికే ప్రారంభించింది. జిల్లా పుస్తక గోడౌన్‌కు చేరుకున్న పాఠ్య పుస్తకాలను ఆయా మండల స్టాక్ పాయింట్లకు తరలిస్తున్నారు.

47 టైటిల్స్

ఈ ఏడాది రాష్ట్ర విద్యా పరిశోధన మండలి (ఎస్‌సీఈఆర్‌టీ) పాఠ్య పుస్తకాలను మరింతగా కుదించింది. గతంలో 173 వరకు టైటిల్స్ ఉండగా, ఇప్పుడు 47 టైటిల్స్ మాత్రమే ఉంటాయి. ప్రాథమిక పాఠశాలలకు గతంలో తెలుగు, గణితం, పరిసరాల విజ్ఞానం పుస్తకాలను రెండు సెమిస్టర్లుగా మూడు పుస్తకాలుగా ముద్రించారు. 3, 4, 5 తరగతులకు తెలుగు, ఇంగ్లిషు ఒక పుస్తకం, గణితం పరిసరాల విజ్ఞానం ఒక పుస్తకంగా సెమిస్టర్–1, సెమిస్టర్–2గా ముద్రించారు. ఇదే మాదిరిగా వర్క్‌బుక్‌లు ముద్రించారు. 6–9 తరగతుల వరకు తెలుగు, హిందీ, ఇంగ్లిషు సబ్జెక్టులను సెమిస్టర్–1, సెమిస్టర్–2గా ముద్రించారు. నాన్ లాంగ్వేజ్ సబ్జెక్టులు విడివిడిగా సెమిస్టర్–1, 2గా ముద్రించారు. 10వ తరగతికి మాత్రం సబ్జెక్టుల వారీగా పుస్తకాలను ముద్రించారు. గణితం మాత్రం సెమిస్టర్–1, 2గా ముద్రించారు. పాఠ్య పుస్తకాలన్నీ బైలింగ్విల్ విధానంలోనే ముద్రించారు. ఒక పేజీలో ఇంగ్లిషు, ఒక పేజీలో తెలుగు పాఠ్యాంశాన్ని ముద్రించి ఇవ్వడం వల్ల విద్యార్థులు ఈజీగా ఏ మీడియంలోనైనా చదువుకునే వీలుంది. గతం నుంచే పాఠ్య పుస్తకంలో క్యూఆర్ కోడ్ కూడా ముద్రిస్తున్నారు. క్యూఆర్ కోడ్ సహాయంతో పాఠ్యాంశానికి సంబంధించిన అదనపు సమాచారాన్ని కూడా పొందేందుకు వీలవుతోంది. విద్యార్థులకు వెన్నెముకపై భారం పడకుండా గత ప్రభుత్వం పాఠ్య పుస్తకంలో సెమిస్టర్ విధానాన్ని అమల్లోకి తీసుకువచ్చింది.

70 శాతం సరఫరా

ఇప్పటి వరకు జిల్లా గొడౌన్‌కు 70 శాతం పుస్తకాలు సరఫరా అయ్యాయి. జిల్లా గోదాంకు చేరుకున్న పుస్తకాల్లో 5,46,935 (32 శాతం) పుస్తకాలను మూడు జిల్లాల పరిధిలో 25 మండలాలకు సరఫరా చేశారు. ఇప్పటి వరకూ 13 టైటిల్స్‌కు సంబంధించి ఒక్క పుస్తకం కూడా సరఫరా కాలేదు. 3, 4, 5 తరగతులకు సంబంధించి ఒక్కొక్క టైటిల్ రావాల్సి ఉండగా, 6, 7, 8, 9, 10 తరగతులకు సంబంధించి రెండేసి టైటిల్స్ సరఫరా కావాల్సి ఉంది. 10 టైటిల్స్ పాఠ్య పుస్తకాలు, మూడు టైటిల్స్ వర్క్ బుక్స్ సరఫరా కావాల్సి ఉంది.



జిల్లా గోదాంలో సరఫరాకు సిద్ధంగా ఉన్న పాఠ్య పుస్తకాలు

సెమిస్టర్–1 రిక్వైర్‌మెంట్, సరఫరా అయిన పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్స్

జిల్లా	ఇండెంట్	సరఫరా	శాతం
తూర్పుగోదావరి	3,04,850	1,82,841	60
కాకినాడ	6,65,317	2,37,738	36
కోనసీమ	4,78,208	1,17,418	25


ఆర్టీసీ కార్గో సర్వీసు ద్వారా..



జిల్లా గోదాంకు ఇప్పటి వరకు 70శాతం పాఠ్య పుస్తకాలు, వర్క్‌బుక్స్ చేరుకున్నాయి. ప్రస్తుత విద్యా సంవత్సరంలో 47 టైటిల్స్ పుస్తకాలు సరఫరా చేస్తున్నాం. జిల్లా గోదాంకు వచ్చిన పాఠ్య పుస్తకాలను ఎప్పటికప్పుడు మండల కేంద్రాలకు ఆర్టీసీ కార్గో సర్వీసు ద్వారా తరలిస్తున్నాం.

– పి.సురేష్, పాఠ్య పుస్తకాల మేనేజరు, బొమ్మూరు

గోదాంకు చేరాయి



ఈ ఏడాది ఏప్రిల్‌లో ముద్రించిన పాఠ్య పుస్తకాలు బొమ్మూరులోని గోదాంకు చేరుకున్నాయి. జిల్లా గోదాం నుంచి ఆయా జిల్లాల పరిధిలో మండల స్టాక్ పాయింట్లకు సరఫరా చేసేందుకు చర్యలు చేపట్టాం. జిల్లా గోదాంకు చేరుకున్న పాఠ్య పుస్తకాలను మే మొదటి వారంలో పూర్తి స్థాయిలో మండల కేంద్రాలకు తరలిస్తాం.

– జి.నాగమణి, ఆర్‌జేడీ, పాఠశాల విద్యాశాఖ, కాకినాడ

క్లుప్తంగా

శతాధిక వృద్ధుడి కన్నుమూత


దాసరి సాహెబ్(ఫైల్)

ముమ్మిడివరం: కొత్తలంక గ్రామంలోని రమాబాయిపేటకు చెందిన దాసరి సాహెబ్(103) బుధవారం ఆయన స్వగృహంలో కన్నుమూశారు. ఆయనకు కుమారుడు, ముగ్గురు మనవళ్లు, ఓ మనవరాలు ఉన్నారు. పెద్ద మనమడు దాసరి నాగేశ్వరరావు దళిత ఉద్యమ రాష్ట్ర నాయకుడిగా వ్యవహరిస్తున్నారు. రెండో మనవడు సాయిబాబా గొల్లవిల్లి నీటి సంఘం అధ్యక్షుడిగా పని చేసి, ప్రస్తుతం అయినవిల్లి మండలం క్రాప గ్రామ సర్వేయర్‌గా ఉన్నారు. జీవనోపాధికి వ్యవసాయ కూలీగా పనిచేసిన సాహెబ్ కొద్ది రోజుల క్రితం వయోభారంతో అనారోగ్యానికి గురై మంచానికి పరిమితమయ్యారు. అప్పటివరకు ఆయన పనులు స్వయంగా చేసుకునేవారు. ఆయన మృతికి పలువురు సంతాపం ప్రకటించారు.

రెడ్ క్రాస్ జాతీయ సమావేశానికి రామారావు

కాకినాడ సిటీ: రెడ్‌క్రాస్ ఆంధ్రప్రదేశ్ శాఖకు ఇటీవల చైర్మన్‌గా, జాతీయ కార్యవర్గ సభ్యుడిగా నియమితులైన వైడీ రామారావు తన తొలి సమావేశానికి హాజరుకావడానికి బుధవారం న్యూఢిల్లీ బయలుదేరి వెళ్లారు. ఈ నెల రెండున రెడ్‌క్రాస్ జాతీయ చైర్మన్, కేంద్ర ఆరోగ్య శాఖ మంత్రి జేపీ నడ్డా అధ్యక్షతన జరిగే సమావేశంలో తాను పాల్గొంటున్నట్టు రామారావు తెలిపారు.

160 కిలోల సముద్ర ఉత్పత్తులు సీజ్

తాళ్లరేవు: వేట నిషేధం నిబంధనలను ఉల్లంఘించి సముద్రంలో మత్స్య సంపదను వేటాడి, విక్రయించేందుకు సిద్ధంగా ఉంచిన 160 కిలోల మత్స్య ఉత్పత్తులను మత్స్య శాఖాధికారులు బుధవారం సీజ్ చేశారు. మండలంలోని మట్లపాలెం మార్కెట్టులో సముద్ర చేపలు, రొయ్యలు విక్రయిస్తున్నట్టు అందిన సమాచారంతో జిల్లా మత్స్య శాఖాధికారి వి.కృష్ణారావు, మత్స్య శాఖ అభివృద్ధి అధికారులు జి.గోపి, కె.ప్రకాశరావు సిబ్బందితో దాడి చేశారు. వ్యాపారులు చెక్కా కృష్ణ, వైదాడి తులసి, పి.నూకరాజుకు చెందిన మత్స్య ఉత్పత్తులను సీజ్ చేశారు. ముగ్గురి వద్ద వేర్వేరుగా సముద్ర చేపలైన 60 కిలోల మెత్తళ్లు, 40 కిలోల బుంగరొయ్యలు, 60 కిలోల మెత్తళ్లు, సొరచేపలను సీజ్ చేసి, అనంతరం బహిరంగ వేలం నిర్వహించారు. వీటికి రూ.13 వేల ఆదాయం సమకూరినట్టు కృష్ణారావు తెలిపారు.

సృష్టి కర్తా శ్రమ జీవే..

- ఉమ్మడి జిల్లాలో విస్తారంగా ఉత్పత్తి సృష్టి
- అహర్నిశలు శ్రమిస్తున్న సంఘటిత, అసంఘటిత కార్మికులు
- సంక్షేమ సేవలందిస్తున్న ఉద్యోగులు, కాంట్రాక్టు వర్కర్లు
- ఐదు నెలలకే శ్రామిక వ్యతిరేకత మూటగట్టుకున్న కూటమి ప్రభుత్వం
- పది నెలల్లో మిన్నంటిన నిరసనలు
- నేడు శ్రామిక దినోత్సవం మే డే



ప్రపంచంలో ఎన్నో వింతలూ.. విశేషాలు. ప్రకృతి పరమైన అద్భుత సౌందర్యాలు నిస్సందేహంగా భగవంతుడి సృష్టే. కానీ.. రాయిపై రాయి పేర్చి, లోహాలను వంచి రూపొందించిన కళాత్మక ఖండాలు, అద్భుత కట్టడాలన్నింటికీ మానవ శ్రమే మూలం. కండలు కరిగించి.. రక్తాన్ని చెమటగా మార్చి.. దేశాభివృద్ధికి దిశానిర్దేశం చూపేది శ్రామికులే. వారి శ్రమ లేనిదే ఏ దేశమూ పురోగతి సాధించదనేది జగమెరిగిన సత్యం. అందుకే శ్రమించే ప్రతిఒక్కరూ సృష్టికర్తలే. ప్రకృతిని సృష్టించిన ఆ భగవంతుడూ ఓ శ్రమ జీవే.


ర్యాంపులో ఇసుకను లోడ్ చేస్తున్న కార్మికులు (ఫైల్)

కపిలేశ్వరపురం: సంపదకు మూలం శ్రమ. ఆ శ్రమను చేసే శ్రామికులు దశా, దిశా నిర్దేతలు. ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాలో విస్తారంగా మానసిక, శారీరక శ్రామికులున్నారు. కాకినాడ జిల్లాలో 62, తూర్పుగోదావరి జిల్లాలో 38, కోనసీమ జిల్లాలో 7 మొత్తం 107 మధ్య తరహా, భారీ పరిశ్రమల ద్వారా ఉత్పత్తి జరుగుతోంది. కాకినాడ జిల్లాలో 1,81,000 హెక్టార్లు, తూర్పుగోదావరి జిల్లాలో 1,23, 027, కోనసీమ జిల్లాలో 1,49,000 హెక్టార్లు వరి సాగవుతోంది. వ్యవసాయానికి అనుబంధంగా రవాణా, రైసుమిల్లు రంగాలు బలోపేతమై ఉన్నాయి. ఈ తరుణంలో కూటమి ప్రభుత్వం శ్రామికులను విస్మరిస్తోంది. అధికారంలోకి వచ్చిన ఐదు నెలలకే శ్రామిక నిరసనలను ఎదుర్కొంటోంది.

ఉమ్మడి జిల్లాలో శ్రామిక శక్తి

కాకినాడ పోర్టు, రాజమహేంద్రవరంలో వర్తక, వ్యాపారాలు, కోనసీమ జిల్లాలో ఆక్వా, కొబ్బరి తదితర రంగాల్లో విస్తారంగా శ్రామికులు ఉత్పత్తి రంగంలో శ్రమిస్తున్నారు. కోనసీమ జిల్లాలో 1,726, తూర్పుగోదావరి జిల్లాలో 1,556 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో విస్తారంగా అంగన్‌వాడీలున్నారు. కాకినాడ జిల్లాలో సుమారు 3,500 మంది అంగన్‌వాడీలున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 1.53 లక్షల జాబ్ కార్డులకు 2.27 లక్షల మంది, కాకినాడ జిల్లాలో 1.96 లక్షల కార్డులకు 1.95 లక్షల మంది, తూర్పుగోదావరి జిల్లాలో 1,61,372 కార్డులకు 1,11,815 మంది ఉపాధి కూలీలున్నారు. కాకినాడ జిల్లాలో 620, కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లో 512 చొప్పున మొత్తం 1,144 సచివాలయాల పరిధిలో వేలాది మంది ఉద్యోగులున్నారు. కోనసీమ జిల్లాలో 355, కాకినాడ జిల్లాలో 428, తూర్పుగోదావరి జిల్లాలో 364 ఎండీయూ వాహనాల నిర్వాహకులున్నారు. ఉమ్మడి జిల్లాలో 3,200 మంది ఆశా కార్యకర్తలున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో 815, కాకినాడ జిల్లాలో 1,060, కోనసీమ జిల్లాలో 1,017 మొత్తం 2,892 మంది వీఓఏలున్నారు. తూర్పు గోదావరి జిల్లాలో 108, కోనసీమ జిల్లాలో 166, కాకినాడ జిల్లాలో 72, మొత్తం 320 వ్యవసాయ సహకార సంఘాల్లో 1,650 మంది ఉద్యోగులు సేవలందిస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లాలో 108 వాహనాలు 22 ఉండగా, 81 మంది, తూర్పుగోదావరిలో 21 వాహనాల్లో 79, కాకినాడ జిల్లాలోని 19 వాహనాల్లో 73 మంది ఈఎంటీలు, డ్రైవర్లు ఉన్నారు. కోనసీమ, తూర్పు గోదావరి జిల్లాల్లోని ర్యాంపుల్లో ఇసుక లోడింగ్ చేసే శ్రామికులు విస్తారంగా ఉన్నారు.


అమలాపురంలో భవన నిర్మాణ పనిలో శ్రామికులు

పాలకుల అణచివేత

మండపేట ఫీల్డ్ అసిస్టెంట్ టి.రాజేశ్వరి తనపై రాజకీయ వేధింపులు తట్టుకోలేక ఆత్మహత్యాయత్నానికి ఒడిగట్టింది. మార్చి 6న ఎన్నికల హామీలపై జీవోలను ఇవ్వాలంటూ విజయవాడలో ఆందోళనకు వెళ్తున్న ఆశా కార్యకర్తలను కూటమి ప్రభుత్వం రాజమహేంద్రవరం, కాకినాడ పోలీస్ స్టేషన్లలో నిర్బంధించింది. సచివాలయ ఉద్యోగులకు ఎడతెరిపి లేకుండా సర్వేలు, సంబంధం లేని శాఖల పనులు అప్పగిస్తూ వేధిస్తోంది. ఉపాధి లేదా నిరుద్యోగ భృతి ఇస్తానంటూ కోనసీమ జిల్లాలో సుమారు 4.80 లక్షల మంది యువకులను, కాకినాడ జిల్లాలో 5,33,908, తూర్పు గోదావరి జిల్లాలో 5.09 లక్షల మంది యువకులను పది నెలలుగా మోసగిస్తోంది. కాకినాడ జిల్లాలో 12,272 మంది, కోనసీమ జిల్లాలో 9,581 మంది, తూర్పుగోదావరి జిల్లాలో 9,117 మంది మొత్తం 30,970 వలంటీర్లను కూటమి ప్రభుత్వం దగా చేసింది. అమలాపురం ఆర్టీసీ డిపోలో డ్రైవర్ కం కండక్టర్ డ్యూటీ చేయాలంటూ వేధించడాన్ని నిరసిస్తూ మార్చి 9న డిపోలో కార్మికులు నిరసనకు దిగారు.

శ్రామికునికి వైఎస్సార్ సీపీ దన్ను

2019 సెప్టెంబర్‌లో ఆర్టీసీని ప్రభుత్వ రంగంలో విలీనం చేయడంతో కార్మికులకు ఎంతో మేలు జరిగింది. ఆటో కార్మికులకు, బోటు ఉన్న మత్స్యకార కుటుంబానికి రూ.10 వేల చొప్పున, మగ్గం ఉన్న చేనేత కార్మిక కుటుంబానికి ఏటా రూ.24 వేలు ఆర్థిక సాయం అందించింది. అంగన్‌వాడీలకు రూ.7 వేల నుంచి రూ.10 వేలకు, ఆశా వర్కర్లకు రూ.3 వేల నుంచి రూ.10 వేలకు వేతనాలను పెంచింది. మున్సిపాలిటీల్లోని కార్మికుల వేతనాలను రూ.18 వేలు చేసి వారి ఆర్థిక ప్రగతికి దోహదపడింది. ప్రతి గ్రామానికి పది మంది చొప్పున సచివాలయ ఉద్యోగాలు కల్పించింది.

> **శ్రామికులపై ప్రభుత్వ నిర్బంధం**
>
> 
>
> కూటమి నేతలు ఎన్నికలప్పుడు ఓట్ల కోసం నోటికొచ్చిన హామీలను ఇచ్చారు. అధికారంలోకి వచ్చాక శ్రామికులపైనా, ఆందోళనలపై నిర్బంధాన్ని విధిస్తోంది. ప్రభుత్వ తీరును ఐక్యంగా ప్రతిఘటిస్తాం.
>
> – కరణం ప్రసాదరావు, కార్మిక నేత, సీఐటీయూ, సామర్లకోట

'కూటమి'పై శ్రామిక పోరాటాలిలా..

ఎన్నికల హామీ మేరకు తమను విధుల్లోకి తీసుకోవాలంటూ ఈ ఏడాది ఫిబ్రవరి 5న అమలాపురంలో వలంటీర్లు ఆందోళన చేపట్టారు. ఫిబ్రవరి 18న ఉమ్మడి జిల్లాలోని ఐసీడీఎస్ కార్యాలయాల ఎదుట అంగన్‌వాడీలు ధర్నాలు చేశారు. ఫిబ్రవరి 28న ఆప్కాస్‌ను రద్దు చేసి మున్సిపల్ కాంట్రాక్టు, అవుట్‌సోర్సింగ్ కార్మికులను ప్రైవేటు ఏజెన్సీలకు అప్పగించే ఆలోచనను విరమించుకోవాలంటూ ఉమ్మడి జిల్లాలో ఆందోళనలు చేపట్టారు. ఫీల్డ్ అసిస్టెంట్లపై రాజకీయ వేధింపులు ఆపాలంటూ ఏప్రిల్ ఒకటిన అమలాపురం జిల్లా కలెక్టరేట్ వద్ద ఫీల్డ్ అసిస్టెంట్లు ధర్నా చేశారు. ఏప్రిల్ రెండున 30 శాతం మధ్యంతర భృతిని ప్రకటించాలంటూ మూడు జిల్లాల కలెక్టరేట్ల వద్ద ఉపాధ్యాయులు ధర్నాలు చేశారు. మార్చి 4న అమలాపురంలో ఆటో యూనియన్ ఆధ్వర్యంలో వాహన మిత్ర తరహా ఆర్థికసాయం కోరుతూ ధర్నా చేశారు. తమను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలంటూ ఫిబ్రవరి 17 నుంచి మూడు రోజుల పాటు అంగన్‌వాడీ కార్యకర్తలు ఆందోళన చేపట్టారు. తమకు మద్యం షాపు కేటాయించాలంటూ జనవరి 27న రాజోలు ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయం ఎదుట కల్లు గీత కార్మికులు ధర్నా చేశారు. అదే రోజు వేతనాలు పెంచాలంటూ మూడు జిల్లాల కలెక్టరేట్ల ఎదుట వీఓఏలు ధర్నా చేపట్టారు. డెలివరీ కమీషన్‌ను పెంచాలంటూ ఏప్రిల్ 24న రాజమహేంద్రవరం కలెక్టరేట్ వద్ద ఎల్‌పీజీ గ్యాస్ డెలివరీ కార్మికులు ధర్నా చేశారు. సంక్షేమ బోర్డును పునరుద్ధరించాలని కోరుతూ అదే రోజు కొవ్వూరు ఆర్డీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. మార్చి 24న స్మార్ట్ మీటర్లతో తమ పొట్ట కొట్టొద్దంటూ కాకినాడ కలెక్టరేట్ వద్ద మీటర్ రీడర్లు ధర్నా చేశారు. ఫిబ్రవరి 9న తమ వేతనాలు పెంచాలని, సీటీసీ విధానాన్ని రద్దు చేసి ఈపీఎఫ్ యాజమాన్య వాటాను యాజమాన్యమే చెల్లించేలా చర్యలు తీసుకోవాలంటూ కాకినాడ జిల్లా కలెక్టరేట్ వద్ద 104 ఉద్యోగులు ధర్నా నిర్వహించారు.

దేవస్థాన పారిశుధ్య కార్మికులకు జీతాలు

సాక్షి ఇంపాక్ట్

అన్నవరం: ప్రముఖ పుణ్యక్షేత్రమైన అన్నవరంలోని శ్రీవీరవేంకట సత్యనారాయణ స్వామివారి దేవస్థానంలో విధులు నిర్వహిస్తున్న 349 మంది పారిశుధ్య సిబ్బందికి మార్చి నెల జీతాలు బుధవారం చెల్లించారు. పారిశుధ్య కార్మికులకు నెలకు రూ.10,500, సూపర్‌వైజర్లకు రూ.12,500 చొప్పున జీతాలు చెల్లించినట్టు వారు తెలిపారు. ఏప్రిల్ నెల దాదాపు గడిచిపోయినా గుంటూరుకు చెందిన కాంట్రాక్ట్ సంస్థ కనకదుర్గా ఏజెన్సీ ఇంకా మార్చి జీతమే చెల్లించకపోవడంతో పారిశుధ్య సిబ్బంది ఆర్థిక ఇబ్బందులు పడుతున్న విషయాన్ని 'సాక్షి'లో ఈ నెల 25న 'మాకు జీతాలు ఎప్పుడిస్తారు స్వామీ?' శీర్షికన వార్త ప్రచురితమైన విషయం తెలిసిందే. దీంతో స్పందించిన అధికారులు కాంట్రాక్ట్ సంస్థకు పారిశుధ్య కార్మికుల బిల్లు ఆగమేఘాలపై పూర్తి చేసి చెక్కు అందజేశారు. దీంతో బుధవారం సిబ్బంది ఖాతాల్లో నగదు జమయింది. ఏప్రిల్ బిల్లు మే పదో తేదీకల్లా చెల్లించేలా చూడాలని సిబ్బంది కోరారు.

రెండు డజన్ల అడుగుల ఎత్తు.. ఈ అరటి చెట్టు

మలికిపురం: రెండు డజన్లు.. అరటి పండ్లు కావు.. అన్ని అడుగుల ఎత్తున పెరిగిన అరటి చెట్టు ఇది. మలికిపురం మండలం గొల్లపాలెం గ్రామంలో రైతు మట్టా శ్రీనివాసరావు ఇంటి పెరట్లో వేసిన అరటి చెట్టు అమాంతం అంత ఎత్తున ఎదిగింది. సాధారణంగా అరటి చెట్లు 15 అడుగులకు మించి పెరగవు. ఈ చెట్టు ఏకంగా 24 అడుగుల ఎత్తు ఎదగడంతో చూపరులు విస్తుపోతున్నారు. ఈ అరటి విత్తనం పేరు బూడిత పక్కీస్ అంటారని, విజయనగరంలోని స్నేహితుల ఇంటి నుంచి తెచ్చినట్లు శ్రీనివాసరావు తెలిపారు. దీని పండ్లు కూడా సాధారణ చక్కెర కేళీ కంటే భారీ సైజులో ఉంటాయన్నారు. ఈ మొక్క వేసిన చోట చుట్టుపక్కల ఇతర మొక్కలను ఎదగనీయదు. మొత్తం నేల ధాతువులను వినియోగించుకోవడమే ఇలా ఎత్తుగా ఎదగడానికి కారణం.


గొల్లపాలెంలో 24 అడుగుల అరటి చెట్టు వద్ద శ్రీనివాసరావు →

జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌చార్జి డీఐజీగా మాధవి

కాకినాడ లీగల్: ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ఇన్‌చార్జి డీఐజీగా ఏలూరు డీఐజీగా పనిచేస్తున్న ఎస్.మాధవిని నియమిస్తూ ఉత్తర్వులు జారీ అయ్యాయి. భీమవరం జిల్లా రిజిస్ట్రార్ లంకా వెంకటేశ్వర్లు ఇప్పటివరకు ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ఇన్‌చార్జి డీఐజీగా వ్యవహరించారు. ఆయన బుధవారం పదవీ విరమణ చేశారు. ఆ స్థానంలో ఏలూరు డీఐజీగా ఎస్.మాధవికి అదనపు బాధ్యతలు అప్పగించారు.

చేతికందొచ్చి.. మృత్యు తీరానికి చేరి..

- విశాఖపట్నంలో ఉద్యోగాలు చేస్తూ కుటుంబాలకు వెన్నుదన్నుగా యువకులు
- సింహాచలం ఘటనలో ఇద్దరి దుర్మరణం
- మృతుల కుటుంబాల్లో చిమ్మిన విషాదం


దుర్గా స్వామినాయుడు ఇంటి వద్ద రోదిస్తున్న మృతుని తల్లి, బంధువులు


ఈశ్వర శేషారావు ఇంటి వద్ద విషాదంలో మృతుని తల్లి, బంధువులు



పత్తి దుర్గాప్రసాద్, మణికంఠ ఈశ్వర శేషారావు మృతదేహాలు

అంబాజీపేట: రెండు కుటుంబాల్లో వారు చేతికి అందివచ్చిన కొడుకులు. విశాఖపట్నంలో ఉద్యోగాలు చేస్తూ కుటుంబాలకు వెన్నుదన్నుగా ఉన్నారు. సింహాచలం ప్రమాదంలో దుర్మరణం చెందారని తెలిసి అంబాజీపేట శివారు కొర్లపాటివారిపాలేనికి చెందిన ఇద్దరు యువకుల కుటుంబాల్లో విషాదం చిమ్మింది. ఈ ఘటనలో కుంపట్ల మణికంఠ ఈశ్వర శేషారావు (శివ) (26), పత్తి దుర్గా స్వామినాయుడు(33) దుర్మరణం పాలయ్యారు. వంట మేస్త్రీగా కుటుంబాన్ని పోషిస్తున్న కుంపట్ల శ్రీనివాసరావు పెద కుమారుడు మణికంఠ ఈశ్వర శేషారావు, రైతు నాయకుడు పత్తి దత్తుడు రెండో కుమారుడు దుర్గా స్వామినాయుడు ఈ ప్రమాదంలో మృతి చెందారని తెలియగానే ఆయా కుటుంబాల్లోనే కాకుండా, అంబాజీపేటలో విషాదం నెలకొంది. చేతికి అందివచ్చిన కొడుకులు శాశ్వతంగా దూరం కావడంతో వారి తల్లిదండ్రులు, బంధువులు గుండెలవిసేలా విలపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. మంగళవారం రాత్రి మృతులిద్దరూ వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి, రేపు చందనోత్సవం సందర్భంగా అప్పన్న దర్శనానికి వెళుతున్నామంటూ, ఎప్పటిలాగే కబుర్లాడుకున్నారు. తెల్లారేసరికి కొడుకులు దుర్మరణం పాలయ్యారన్న సమాచారం విని ఆ తల్లిదండ్రులు తల్లడిల్లిపోయారు. ఇద్దరు యువకులకు పెళ్లిళ్లు కాకపోవడంతో, వారి కుటుంబ సభ్యులు సంబంధాలు చూస్తున్నారు. ఈ సమయంలో చేదు వార్తను వినాల్సి వచ్చిందంటూ కన్నీరుమున్నీరయ్యారు.

విశాఖపట్నంలో ఉద్యోగాలు

కాగా, కుంపట్ల మణికంఠ ఈశ్వరశేషారావు (శివ) ఏడాది నుంచి విశాఖపట్నంలో మెట్రోకెమ్ కంపెనీలో ఫుడ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్నాడు. అతడికి తల్లిదండ్రులు శ్రీనివాసరావు, సీతామహాలక్ష్మి, సోదరుడు ఉన్నారు. తండ్రి, అతని సోదరుడు వంటలు చేస్తూ జీవనం సాగిస్తున్నారు. సెలవు దినాల్లో అంబాజీపేట వచ్చినప్పుడు తండ్రి చేసే కేటరింగ్ వృత్తిలో సాయం చేసేవాడు. ఉద్యోగం చేస్తూ అతడు తన కుటుంబానికి అండగా ఉంటున్నాడు. ఈశ్వర శేషారావు మృత్యువాత పడటంతో ఆ కుటుంబానికి కీలకాధారం లేకుండా పోయింది. ఉద్యోగంలో స్థిరపడి కుటుంబానికి చేదోడువాదోడుగా ఉంటున్నాడని తండ్రి శ్రీనివాసరావు, తల్లి సీతామహాలక్ష్మి రోదిస్తున్నారు. మరో మృతుడు పత్తి దుర్గా స్వామినాయుడు(33) విశాఖపట్నంలో ఇంటీరియర్ డెకరేషన్ వర్క్ చేస్తున్నారు. సుమారు 30 మందికి పనులు కల్పిస్తున్నాడు. అతడికి తండ్రి దత్తుడు, తల్లి వెంకటరమణ, సోదరుడు, సోదరి ఉన్నారు. ఇటీవల కాలంలోనే సోదరి వివాహాన్ని దుర్గా స్వామినాయుడు దగ్గరుండి ఘనంగా నిర్వహించారు. సంవత్సరాది పండగ నాడు కొర్లపాటివారిపాలెం గ్రామ దేవత వనువులమ్మ జాతరకు ఏటా దుర్గా స్వామినాయుడు అమ్మవారి ఫొటోలతో క్యాలెండర్లను ముద్రించి, ఇంటింటికీ స్వయంగా పంచిపెట్టేవాడు. అతని మరణ వార్త విని కొర్లపాటివారిపాలెంలో విషాదం నెలకొంది. ఇంటీరియర్ వర్కుతో అందరి మన్ననలు పొందడమే కాకుండా, పలు అవార్డులను గెలుచుకున్నాడు. తండ్రి రైతు నాయకుడిగా ఉంటూ వ్యవసాయం చేస్తున్నారు. తన కుటుంబానికి ఆర్థికంగా నిలదొక్కుకునే సమయంలో దుర్గా స్వామినాయుడు శాశ్వతంగా దూరం కావడంతో ఆ కుటుంబంలో విషాదం అలుముకుంది. పి.గన్నవరం ఎమ్మెల్యే గిడ్డి సత్యనారాయణ కొర్లపాటివారిపాలెంలోని మృతుల ఇళ్లకు వెళ్లి, వారి కుటుంబాలను పరామర్శించారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీసెల్ కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబు సంతాపం ప్రకటించి, వారి కుటుంబాలకు సానుభూతి వ్యక్తం చేశారు.

> **మూడోసారి జంట మరణాలు**
>
> కొర్లపాటివారిపాలెంలో జంట యువకులు మృత్యుఒడికి చేరడం ఇది మూడోసారి. 2001లో పి.గన్నవరం శివకోడు ప్రధాన పంట కాలువలో పడి ఇద్దరు మృతి చెందారు. 2008లో పుణ్య దినాలను పురస్కరించుకుని పి.గన్నవరం వైనతేయి గోదావరి నదిలో స్నానమాచరిస్తున్న ఇద్దరు యువకులు సుడిగుండంలో చిక్కుకుని మృత్యువాత పడ్డారు. తాజాగా సింహాచలం సింహాద్రి అప్పన్న దర్శనానికి వెళ్లి ఈ ఇద్దరు యువకులు తిరిగిరాని లోకాలకు చేరడంతో గ్రామంలో తీవ్ర విషాదం నెలకొంది.

సాక్షి క్లాసిఫైడ్స్

Wanted

■ సాయిరామ్ హోంకేర్ Hydలో బేబీ&పేషెంట్‌కేర్ ముసలివారిని చూసుటకు ఆయాలు / నర్సులు ఇంటి/వంట పనికి ఆడ/మగ కావలెను.జీ:18వేలు.9949094607,9908454607 [SCA25002986]

■ కన్సల్టెన్సీ కాదు VIPఇంట్లో పెద్దవాళ్ళని చూసుకోవడానికి స్త్రీలు/ పురుషులు, ఆయా, నర్సులు, వంటవారు, RMP&డ్రైవర్స్ కావలెను. జీ: 15వేలు -40వేలు,ఫ్రీరూం+భోజనం.Hyd.7993583999 [HA-476]

Goods

SECOND HAND SALE

■ Lab & X-Ray Equipment for sale.Fuji Digital X-Ray Equipment. GE 100 Mobile X-Ray for sale in Draksharama.Cont: 70133 25464 [SCA-25003104]

ఈ సెక్షన్‌లో ప్రకటనల కొరకు
సాక్షి క్లాసిఫైడ్స్
నాలుగు లైన్లకు రూ. : 400/-
అదనపు లైనుకు రూ. : 90/-
GST 5% Extra
సర్వే నెం.264, ADB రోడ్, రాజానగరం.
ఫోన్: 0883-2483010

గమనిక
సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

CHAITANYA GODAVARI GRAMEENA BANK
(A Government Undertaking Sponsored by Union Bank of India)
HEAD OFFICE : : RAGHU MANSION, 4/1, BRODIPET, GUNTUR-522 002, A.P. www.cggb.in

Deposits ₹12113.39 Crore 20.78% ↑
Advances ₹13159.28 Crore 15.28% ↑
Aggregate Business ₹25272.67 Crore 17.85% ↑
Operating Profit ₹431.22 Crore 21.00% ↑
Net Profit After Tax ₹302.25 Crore 19.98% ↑
Net Worth ₹1554.78 Crore 24.13% ↑
Net NPA NIL
Jury Appreciation Award for supporting MSMSEs under MSME Banking & NBFC Excellence Awards, 2024 by CIMSME
Bank is adjudged for GOLD award under "Priority Sector Performance" Category & SILVER award under "Technology Upgradation" Category in the 99th SKOCH Summit

FORM - A
BALANCE SHEET AS ON 31ST MARCH 2025 (Rs. in '000)

PARTICULARS	SCHEDULE	31.03.2025	31.03.2024
CAPITAL & LIABILITIES			
Capital	1	74422	74422
Reserves and Surplus	2	15473387	12450862
Deposits	3	121133865	100289209
Borrowings	4	42030610	45995436
Other Liabilities & Provisions	5	2978347	2367634
TOTAL		**181690631**	**161177563**
ASSETS			
Cash and Balances with Reserve Bank of India	6	6417748	7710215
Balance with Banks and Money at call and Short Notice	7	19324802	14948465
Investments	8	19592603	21219220
Advances *	9	130874902	113377897
Fixed Assets	10	489229	263100
Other Assets	11	4991347	3658686
TOTAL		**181690631**	**161177563**
Contingent Liabilities	12	395750	381268
Bills for Collection		292409	466617

* Advances are netted of IBPC of Rs.1000 crore as on 31.03.2025 and Rs.1000 crore as on 31.03.2024
previous year figures are re-grouped wherever necessary

FORM - B
PROFIT & LOSS ACCOUNT FOR THE YEAR ENDED 31ST MARCH 2025 (Rs. in '000)

PARTICULARS	SCHEDULE	31.03.2025	31.03.2024
1. INCOME			
Interest Earned	13	15556635	13288120
Other Income	14	2341250	1778016
TOTAL		**17897885**	**15066136**
2. EXPENDITURE			
Interest Expended	15	10316257	8809748
Operating Expenses	16	3269432	2692596
Provisions and Contingencies		1289671	1044645
TOTAL		**14875360**	**12546989**
3. PROFIT / LOSS			
Net Profit/Loss(-) for the year		3022525	2519147
Profit/Loss(-) brought forward		100	100
TOTAL		**3022625**	**2519247**
4. APPROPRIATIONS			
Transfer to Statutory Reserves		604525	510000
Transfer to Other Reserves		2418020	2009147
Transfer to Government / proposed dividend		0	0
Balance carried over to balance sheet		100	100
TOTAL		**3022625**	**2519247**

Disclosure in financial statements – Notes to Accounts (Excerpts from Schedule 18): (1) CRAR: 15.43%, (2) Movement of Gross NPAs: (a) Opening Balance: Rs.7736.19 lakh, (b) Additions during the year: Rs.2384.83 lakh, (c) Reductions during the year: Rs.2941.95 lakh, (d) Closing Balance: Rs.7179.07 lakh, (3) Provision towards Standard Assets: Rs.3780.39 lakh, (4) Bank made provision for NPAs over and above the required provision as per IRAC norms. The Provision Coverage Ratio (PCR) stood at 100.00% as on 31st March 2025. Thus the advances shown in the balance sheet are net of NPA provision of Rs.7179.07 lakh, (5) Bank has not drawn any amount from Reserves during the current financial year 2024-25, (6) Provision made for income Tax: Rs. 107.27 crore, (7) Business Ratios: (i) Interest Income as a percentage to Working Funds: 8.89 % (8.42%), (ii) Non-interest income as a percentage to Working Funds: 1.34% (1.13%), (iii) Cost of Deposits : 6.72% (6.38%), (iv) Net Interest Margin : 2.99% (2.84%), (v) Operating Profit as a percentage to Working Funds: 2.47% (2.26%), (vi) Return on Assets : 1.73% (1.60%). (vii) Business (Deposits plus advances) per employee: Rs.17.71 crore (Rs. 16.95 crore), (viii) Profit per employee (Net profit): Rs. 0.22 crore (Rs. 0.20 crore). [Figures in brackets pertain to previous year]. (8) During the year ended with March 2025, no penalty has been levied by RBI, (9) Priority Sector Lending Certificates (PSLC): (i) Bank sold PSLC-Agri of Rs. 500.00 crore & PSLC-SF&MF of Rs.4000 crore and earned income of Rs. 80.39 crore. (ii) Bank purchased PSLC-General of Rs.3900.00 crore & PSLC-Micro Enterprises of Rs.600.00 crore at a premium of Rs.0.45 crore. **Note: (1) The financial statements for FY2025 are audited by Statutory Central Auditors, M/s SOMAYAJULU & ASSOCIATES, Chartered Accountants, Visakhapatnam.** (2) The above results have been approved and taken on record by the Board of Directors of the Bank at the meeting held on 25.04.2025. (3) The financial results have been prepared in accordance with the Master Direction on 'Financial Statements – Presentation & Disclosures' dated 30.08.2021, issued by RBI and updated as on 01.04.2025 (as applicable to RRBs). (4) The net profit after tax is arrived at after considering provisions for standard assets and non-performing assets as per prudential norms issued by NABARD, provisions for staff related items and provision for taxes and other necessary provisions.

Place : GUNTUR
Date : 25-04-2025

Sd/- K Pramod Kumar Reddy
Chairman